డీ జే

DHRUV JUREL

దంచికొట్టిన వికెట్ కీపర్

రెండో రోజు ఆట అనంతరం కష్టాల్లో పడ్డట్లు కనిపించిన టీమ్‌ఇండియాను.. యువ వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ ఆదుకున్నాడు. టాపార్డర్ తడబడ్డ చోట ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగి.. చకచక పరుగులు జోడించాడు. ఫలితంగా తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్‌కు నామమాత్ర ఆధిక్యం దక్కగా.. రెండో ఇన్నింగ్స్‌లో అశ్విన్ అదరగొట్టాడు! గింగిరాలు తిరిగే బంతులతో అశ్విన్ ఇంగ్లిష్ బ్యాటర్లను క్రీజులో కుదురుకోనివ్వకుండా విజృంభిస్తే.. తానే తక్కువ కాదన్నట్లు కుల్దీప్ యాదవ్ తన మణికట్టు కనికట్టు కనబర్చాడు. ఫలితంగా రోహిత్‌సేన ముందు 192 పరుగుల నామమాత్ర లక్ష్యం నిలువగా.. మూడో రోజు పూర్తయ్యేసరికి టీమ్‌ఇండియా వికెట్ నష్టపోకుండా 40 పరుగులు చేసింది. మరో 152 రన్స్ కొడితే.. సిరీస్ రోహిత్ సేన సొంతం కానుంది!!

టీమ్‌ఇండియా తొలి ఇన్నింగ్స్ 353

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 145

అశ్విన్‌కు 5 వికెట్లు

రోహిత్ సేన లక్ష్యం 192; ప్రస్తుతం 40/0

సిరీస్ విజయానికి 152 పరుగుల దూరంలో భారత్

ధ్రువ్ (90)

రాంచీ: స్వదేశంలో మరో సిరీస్ పట్టేసేందుకు టీమ్‌ఇండియా సిద్ధమైంది. భిన్నంగా స్పందిస్తున్న రాంచీ పిచ్‌పై మన స్పిన్నర్లు సత్తాచాటడంతో నాలుగో టెస్టుపై రోహిత్ సేన పట్టు సాధించింది. రవిచంద్రన్ అశ్విన్ (5/51), కుల్దీప్ యాదవ్ (4/22) ధాటికి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 145 పరుగులకు కుప్పకూలింది. ఓపెనర్ జాక్ క్రాలీ (60) ఒంటరి పోరాటం చేయగా.. పోప్ (0), డకెట్ (15), రూట్ (11), స్టోక్స్ (4), ఫోక్స్ (17) విఫలమయ్యారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 46 పరుగులతో కలుపుకొని.. భారత్ ముందు 192 పరుగుల లక్ష్యం నిలిచింది. మూడో సెషన్ చివర్లో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమ్‌ఇండియా.. వికెట్ నష్టపోకుండా 40 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (24 బ్యాటింగ్; 4 ఫోర్లు), యశస్వి జైస్వాల్ (16 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. చేతిలో 10 వికెట్లు ఉన్న భారత్.. విజయానికి ఇంకా 152 పరుగుల దూరంలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 219/7తో ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్.. చివరకు 307 పరుగులకు ఆలౌటైంది. చేతిలో ఉన్న మూడు వికెట్లతో ధ్రువ్ జురెల్ (90; 6 ఫోర్లు, 4 సిక్సర్లు) అద్వితీయ పోరాటం చేశాడు. అతడికి కుల్దీప్ యాదవ్ (131 బంతుల్లో 28) చక్కటి సహకారం అందించాడు. కుల్దీప్ అండగా ఉన్నంతసేపు ఆచితూచి ఆడిన ధ్రువ్.. ఆ తర్వాత ధనాధన్ షాట్లతో ప్రత్యర్థి ఆధిక్యాన్ని కుదించాడు. దీంతో టీమ్‌ఇండియా ఈ మ్యాచ్‌లో పునరాగమనం చేయగలిగింది.

అశ్విన్ (5/51)

1 టెస్టుల్లో 35వ సారి 5 వికెట్ల ప్రదర్శన చేసిన అశ్విన్.. భారత్ నుంచి అత్యధిక సార్లు ఈ ఘనత సాధించిన అనిల్ కుంబ్లే (35) సరసన చేరాడు.

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 353; **భారత్ తొలి ఇన్నింగ్స్:** 307 (ధ్రువ్ 90, యశస్వి 73; బషీర్ 5/119, హార్ట్‌లీ 3/68); **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** 145 (క్రాలీ 60; అశ్విన్ 5/51, కుల్దీప్ 4/22); **భారత్ రెండో ఇన్నింగ్స్:** 40/0 (రోహిత్ 24 నాటౌట్, యశస్వి 16 నాటౌట్).

సెల్యూట్ సెలబ్రేషన్స్

తొలి ఇన్నింగ్స్‌లో కష్టసమయంలో క్రీజులోకి వచ్చిన ధ్రువ్ జురెల్ చక్కటి బ్యాటింగ్‌తో విమర్శకులు ప్రశంసలు అందుకున్నాడు. ధోనీని తలపించాడని.. బ్యాటింగ్ దిగ్గజం సునీల్ గవాస్కర్ కొనియాడగా.. చివరి వరస బ్యాటర్లతో కలిసి ఎలా ఆడాలో ధ్రువ్‌ను చూసి నేర్చుకోవాలని ఆకాశ్ చోప్రా పేర్కొన్నాడు. అర్ధశతకం అనంతరం ధ్రువ్ సంబురాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కార్గిల్ యుద్ధంలో సైనికుడిగా సేవలందించి పదవీ విరమణ పొందిన తండ్రి కోసం హాఫ్‌సెంచరీ తర్వాత ధ్రువ్ సెల్యూట్‌తో సెలబ్రేషన్స్ జరుపుకున్నాడు.

ధీరజ్ తీన్‌మార్

బాగ్దాద్: తెలుగు ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ ఆసియా ఆర్చరీ కప్‌లో స్వర్ణంతో మెరిశాడు. పురుషుల టీమ్, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో బంగారు పతకాలు సాధించిన ధీరజ్.. ఆదివారం జరిగిన వ్యక్తిగత రికర్వ్ విభాగంలో 7-3తో భారత్‌కే చెందిన తరుణ్‌దీప్ రాయ్‌పై విజయం సాధించాడు. మహిళల విభాగంలో దీపిక కుమారి రెండు స్వర్ణాలు గెలిచింది. దీంతో మొదటి అంచె పోటీల్లో భారత ఆర్చర్లు మొత్తం 14 పతకాలు ఖాతాలో వేసుకున్నారు.

అలికాకు రజతం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఫెడరేషన్ కప్ పుషు చాంపియన్‌షిప్‌లో తెలంగాణ అమ్మాయి అలికా జోయ్ రజత పతకంతో మెరిసింది. జార్ఖండ్ రాజధాని రాంచీలో జరిగిన పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన అలికా 7.50 స్కోరుతో రెండో స్థానం దక్కించుకుంది. గీత (మణిపూర్; 8.00), హర్షిత (చండీగఢ్ 7.10) వరుసగా స్వర్ణ, కాంస్యాలు గెలుచుకున్నారు.

సౌమ్య సూపర్

న్యూఢిల్లీ: తెలంగాణ యువ ఫుట్‌బాల్ ప్లేయర్ గుగులోత్ సౌమ్య సూపర్ గోల్‌తో సత్తాచాటడంతో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు హాంకాంగ్‌పై విజయం సాధించింది. ఆదివారం జరిగిన పోరులో భారత్ 2-0తో హాంకాంగ్‌పై గెలుపొందింది. భారత్ తరపున సౌమ్య (80వ నిమిషంలో), అంజు తమాంగ్ (19వ ని.లో) చెరో గోల్ కొట్టారు.

చాంపియన్ తెలంగాణ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జాతీయ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాలికల జట్టు చాంపియన్‌గా నిలిచింది. బీహార్ రాజధాని పాట్నాలో ఆదివారం జరిగిన టోర్నీ ఫైనల్లో తెలంగాణ 24-23తేడాతో కేరళపై గెలుపొందింది. ఆద్యాంతం హోరాహోరీగా సాగిన తుదిపోరులో మన అమ్మాయిలు ఉత్కంఠను అధిగమించి విజయం సాధించారు. అద్వితీయ ప్రదర్శన కనబర్చిన మన జట్టును రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సంఘం ప్రతినిధులు శోభన్‌బాబు అభినందించారు.

హర్మన్ మెరుపులు

ముంబై సెకండ్ విక్టరీ

డబ్ల్యూపీఎల్ రెండో సీజన్

హర్మన్ (46*)

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్ జోరు కొనసాగుతున్నది. లీగ్ ఆరంభ పోరులో ఢిల్లీపై చివరి బంతికి సిక్సర్‌తో విజయం సాధించిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబై ఇండియన్స్.. రెండో మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తుచేసింది. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 126 పరుగులు చేసింది. టాపార్డర్ విఫలం కాగా.. తనూజ కన్వర్ (28), క్యాథరిన్ బ్రైస్ (25), బెత్ మూనీ (24) పర్వాలేదనిపించారు. ముంబై బౌలర్లలో అమెలియా కెర్ 4, షబ్నమ్ ఇస్మాయిల్ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ముంబై 18.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 129 రన్స్ కొట్టింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (46 నాటౌట్; 5 ఫోర్లు, ఒక సిక్సర్), అమెలియా కెర్ (31) రాణించింది. లీగ్‌లో భాగంగా సోమవారం యూపీ వారియర్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడనుంది.

తెలంగాణ 400 మీటర్ల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లకు ఆదివారం హైదరాబాద్‌లో ట్రోఫీలు అందజేస్తున్న నిర్వాహకులు

శ్రీనిధి గెలుపు జోరు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఐ లీగ్‌లో శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ జోరు కనబరుస్తున్నది. ఆదివారం జరిగిన పోరులో శ్రీనిధి ఎఫ్‌సీ 2-0తో నామ్‌దారి ఎఫ్‌సీపై విజయం సాధించింది. రిజ్వాన్ హసన్ రెండు గోల్స్‌తో అదరగొట్టాడు. తొలి అర్ధభాగంలో రిజ్వాన్ ఓ గోల్ చేసి శ్రీనిధి జట్టును ముందంజలో నిలుపగా.. సెకండ్ హాఫ్‌లో మరో గోల్‌తో జట్టు ఆధిక్యాన్ని పెంచడంతో పాటు మ్యాచ్‌ను విజయంతో ముగించాడు. ఇప్పటి వరకు ఆడిన 15 మ్యాచ్‌ల్లో శ్రీనిధి 32 పాయింట్లు ఖాతాలో వేసుకుంది.

ఆసీస్ క్లీన్‌స్వీప్

ఆక్లాండ్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆస్ట్రేలియా.. న్యూజిలాండ్‌పై టీ20 సిరీస్ క్లీన్ స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన చివరిదైన మూడో మ్యాచ్‌లో ఆసీస్ 27 పరుగుల తేడాతో (డక్‌వర్త్ లూయిస్) కివీస్‌ను చిత్తుచేసింది. తొలుత ఆసీస్ 10.4 ఓవర్లలో 4 వికెట్లకు 118 రన్స్ కొట్టింది. హెడ్ (33), షార్ట్ (27) రాణించారు. అనంతరం లక్ష్యఛేదనలో కివీస్ 3 వికెట్లు కోల్పోయి 98 పరుగులకు పరిమితమైంది. గ్లెన్ ఫిలిప్స్ (40) పోరాడినా ఫలితం లేకపోయింది.

చిత్రం

పవర్ తర్వాత లవర్ వస్తాడు..

వరుసపెట్టి సినిమాలు చేసుకుంటూ జెడ్ స్పీడ్‌లో దూసుకుపోతున్నాడు నాని. ఆయన హీరోగా డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న 'సరిపోదా శనివారం' సినిమా త్వరలోనే విడుదల కానుంది. ఈ లోపే మరో సినిమాకు పచ్చజెండా ఊపేశాడు నాని. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి కలిసి నిర్మించనున్న ఈ చిత్రానికి సుజీత్ దర్శకుడు. ప్రస్తుతం పవన్‌కల్యాణ్‌తో 'ఓజీ' చిత్రాన్ని సుజిత్ తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఆ సినిమా పూర్తిచేసి, నాని ప్రాజెక్ట్‌లో బిజీ కానున్నారు సుజిత్. ఈ సందర్భంగా 'ఇది సుజిత్ సినిమా.. పవర్ తర్వాత.. లవర్ వస్తాడు..' అంటూ తన ఎక్స్‌లో ట్వీట్ చేశాడు నాని. ఒక క్రూరుడు అహింసామార్గాన్ని ఆశ్రయిస్తే తదనంతరం అతని జీవితంలో ఎదురైన పరిణామాల నేపథ్యంలో ఈ కథ నడుస్తుందని తెలుస్తున్నది. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.

ఈ సినిమా మరింత నవ్విస్తుంది

అంజలి నటించిన హారర్ సినిమా 'గీతాంజలి'కి కొనసాగింపుగా వస్తున్న సినిమా 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. శివ తుర్లపాటి దర్శకుడు. కోన వెంకట్ నిర్మాత. మార్చి 22న ఈ విడుదల కానుంది. ఈ మూవీ టీజర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. దర్శకులు మలినేని గోపీచంద్, బాబీ, బుచ్చిబాబు సాన, హీరో శ్రీవిష్ణు అతిథులుగా హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. అంజలి మాట్లాడుతూ ' కథానాయికగా ఈ సినిమాతో 50 సినిమాలు పూర్తి చేసుకున్నందుకు ఆనందంగా ఉంది. పదేళ్ల తర్వాత మళ్లీ ఈ తరహా సినిమా చేయగలిగాం అంటే అదంతా కోన వెంకట్‌గారి చలవే.' అన్నారు. పదేళ్ల క్రితం వచ్చిన 'గీతాంజలి'లా ఈ సినిమా కూడా ట్రెండ్ సెట్టర్ అవుతుందని కోన వెంకట్ నమ్మకం వ్యక్తం చేశారు. ఇంకా చిత్రయూనిట్ మాట్లాడారు.

ఆటుపోట్ల తర్వాత దక్కిన విజయం ఇది

'ఈ సినిమా విడుదల విషయంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నాను. విడుదలై విజయవంతంగా ప్రదర్శింపబడుతుంటే కష్టం మొత్తం దూదిపింజలా ఎగిరిపోయినట్టు అనిపిస్తుంది. అంటూ కన్నీటి పర్యంతం అయ్యారు నిర్మాత భవాని కాసుల. తను నిర్మించిన 'మస్తు షేడ్స్ ఉన్నాయ్‌రా' చిత్రం ఇటీవలే విడుదలైంది. అభినవ్ గోమఠం, వైశాలీరాజ్ హీరోహీరోయిన్లు. తిరుపతిరావు ఇండ్ల దర్శకుడు. ఈ సినిమా థ్యాంక్స్ మీట్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడారు. రోజురోజుకీ సినిమాకు ఆదరణ పెరుగుతున్నదని దర్శకుడు చెప్పారు. విడుదలకు ముందు కాస్తంత టెన్షన్ ఉండేదని, ఫలితం తెలిశాక రిలాక్స్‌గా ఉందని అభినవ్ గోమఠం అన్నారు.

ఆ ఆనందాన్ని ఆస్వాదించలేకపోయా..

'యానిమల్' సినిమా నటిగా కూడా రష్మికను మరో మెట్టుపైన నిలబెట్టింది. ఆ సినిమా సాధించిన విజయం కూడా సామాన్యమైన విజయం కాదు. దాదాపుగా వెయ్యికోట్ల రూపాయలు గ్రాస్ వసూళ్లను రాబట్టింది. బాలీవుడ్‌లో విజయాలను అందుకోవడం చాలా మంది హీరోయిన్ల కల. మరి ఆ కల నిజమైనా.. ఆ ఆనందాన్ని ఆస్వాదించలేకపోవడంపై రష్మిక ఇటీవల సోషల్‌మీడియాలో మాట్లాడింది. ' మా 'యానిమల్'పై ప్రశంసలు కురిశాయి. డబ్బులు కూడా అంతకంటే బాగా కురిశాయి. అయితే.. ఆ విజయాన్ని ఎంజాయ్ చేయలేకపోయాను. కనీసం ప్రమోషన్స్‌లో కూడా ఎక్కువగా పాల్గొనలేకపోయాను. దానికి కారణం ఒప్పుకున్న ప్రాజెక్ట్‌లే. నేను చేస్తున్న సినిమాలన్నీ ప్రతిష్టాత్మకమైనవే. ఆ సినిమాల షూటింగులకోసం రాత్రింబవళ్లూ ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి. అందుకే 'యానిమల్' టీమ్‌తో పాటు అభిమానుల్ని కూడా మిస్ అయ్యాను. ఆ లోటును నా రాబోయే సినిమాలు భర్తీ చేస్తాయని భావిస్తున్నాను. అభిమానుల ప్రేమ ఇచ్చేంత సంతోషం నాకు ఏదీ ఇవ్వదు' అంటూ చెప్పుకొచ్చింది రష్మిక మందన్నా..

చూసినవారు క్లైమాక్స్ రివీల్ చేయొద్దు..

'సిద్ధార్థ్‌రాయ్'కి మంచి స్పందన వస్తున్నది. నా కేరక్టరైజేషన్‌కి ఆడియన్స్ బాగా కనెక్ట్ అవుతున్నారు. కొత్త కథను చూడాలనుకునేవారికి మా సినిమా సరైన ఆప్షన్. చూసినవారు క్లైమాక్స్‌ని రివీల్ చేయొద్దని కోరుతున్నాను.' అన్నారు హీరో దీపక్ సరోజ్. ఆయన హీరోగా రూపొందిన చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'. తన్వి కథానాయిక. వి.యశస్వీ దర్శకుడు. జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన నిర్మాతలు. ఈ సినిమా సక్సెస్‌మీట్ హైదరాబాద్‌లో జరిగింది. ఫస్టాఫ్‌కి యూత్, సెకండాఫ్‌కి పెద్దలు కనక్టవుతున్నారని, కమర్షియల్‌గా కూడా ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందని నమ్ముతున్నామని దర్శకుడు చెప్పారు. ఇంకా యూనిట్ సభ్యులు మాట్లాడారు.

లేచి సెల్యూట్ కొట్టాలనిపించే సినిమా ఇది: చిరంజీవి

నందకుమార్ అబ్బినేని, సిద్దు ముద్దా, చిరంజీవి, వరుణ్‌తేజ్, శక్తిప్రతాప్ సింగ్ హుడ

' దేశంకోసం ప్రాణాలను పణంగా పెట్టే వీరసైనికుల గాథలపై రీసెర్చ్ చేసి, నేరుగా వారిని కలిసి, వారి సూచనలను కూడా తీసుకొని తయారు చేసుకున్న కథ 'ఆపరేషన్ వాలంటైన్'. ఇలాంటి కథలు చూసినప్పుడు మనసంతా ఉద్వేగంతో నిండిపోతుంది. లేచి సెల్యూట్ కొట్టాలనిపిస్తుంది. అందుకే.. ఈ వేడుకకు వరుణ్ ఆహ్వానించినప్పుడు అదో బాధ్యతగా, సదావకాశంగా భావించాను.' అని పద్మవిభూషణ్ చిరంజీవి అన్నారు. వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందిన ఏరియల్ వార్ డ్రామా 'ఆపరేషన్ వాలెంటైన్'. శక్తి ప్రతాప్‌సింగ్ హుడా దర్శకుడు. సందీప్ ముద్దా నిర్మాత. మార్చి 1న పానిండియా స్థాయిలో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో చిరంజీవి మాట్లాడారు. 'వరుణ్ హీరో కావడానికి కారణం నేనే అయినా.. నటుడిగా నన్నెప్పుడూ తను అనుసరించలేదు. తను చేసిన పదమూడు సినిమాల్లో పదమూడు రకాల పాత్రలు చేశాడు. విభిన్నమైన పాత్రలతో మంచి నటుడిగా ఎదిగాడు. ఈ విషయంలో వరుణ్‌ని కచ్చితంగా అభినందించాలి. సినిమా బాగా వచ్చిందని అందరూ అంటున్నారు. నటీనటులు, సాంకేతికనిపుణులు అందరూ మనసు పెట్టి చేసిన ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి.' అని చిరంజీవి ఆకాంక్షించారు. రక్తాన్నీ, స్వేదాన్ని ధారపోసి చేసిన సినిమా ఇదని, బాధ్యతగా భావించి ఈ సినిమా చేశామని, తన కెరీర్‌లోనే ఇది ప్రత్యేకమైన సినిమా అని వరుణ్‌తేజ్ అన్నారు. దేశాన్ని కాపాడే సైనికుడిగా వరుణ్ నటించడం పట్ల నాగబాబు ఆనందం వెలిబుచ్చారు. ఇంకా యూనిట్‌సభ్యులందరూ మాట్లాడారు.

సుమన్,ప్రతాని రామకృష్ణగౌడ్‌తదితరులు

దుబాయ్‌లో టీఎఫ్‌సీసీ సౌతిండియా నంది అవార్డులు

తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో దుబాయ్‌లో వైభవంగా టిఎఫ్‌సీసీ సౌత్ ఇండియా నంది అవార్డుల వేడుకలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా దుబాయ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నంది అవార్డులకు సంబంధించిన బ్రౌచర్‌ని హీరో సుమన్ చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. సుమన్ మాట్లాడుతూ 'ఇప్పటివరకూ దుబాయ్‌లో ఉత్తరాదికి చెందిన సినిమా అవార్డులే జరిగాయి. ఈ సారి సౌత్ సినిమా అవార్డుల వేడుక జరుగనుండటం ఆనందంగా ఉంది. దీనికి కారకులైన తెలంగాణ ఫిల్మ్‌ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్‌ని అభినందిస్తున్నాను. ఈ అవార్డుల వేడుకతో తెలుగు సినిమా వైభవం మరింత తేజోవంతం కావాలి' అని ఆకాంక్షించారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ సినీరంగాలకు చెందిన నటీనటులతోపాటు 24శాఖలకు చెందిన సాంకేతిక నిపుణులకు కూడా ఈ అవార్డులు అందించడం జరుగుతుందని, ఈ వేడుక దుబాయ్‌లో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ప్రతాని రామకృష్ణగౌడ్ తెలిపారు. ఇంకా టీ హోమ్స్ సీఏండీ వైకుంఠరావు, దుబాయ్ ప్రిన్స్ మేనేజర్ బిను చార్లీ, సీఏ రవికుమార్ సింగిరి తదితరులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

'మనుషులంతా ఒక్కటే' నిర్మాత మహేశ్ కన్నుమూత

ఎన్టీయార్ 'మనుషులంతా ఒక్కటే' చిత్ర నిర్మాత వి.మహేశ్(85) శనివారం రాత్రి చెన్నైలో గుండెపోటుతో మరణించారు. బాత్‌రూం నుంచి బయటికి వస్తూ కాలుజారి పడిన ఆయనను దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మహేశ్ మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. దాసరి నారాయణరావు దర్శకత్వంలో ఎన్టీయార్ హీరోగా ఆయన నిర్మించిన 'మనుషులంతా ఒక్కటే' చిత్రం చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. ఎన్టీయార్‌తోనే 'మహాపురుషుడు', చిరంజీవితో 'సింహపురి సింహం', సుమన్‌తో 'ముసుగుదొంగ' చిత్రాలను మహేశ్ నిర్మించారు. శ్రీవేంకటేశ్వర భక్తిచానల్‌లో ప్రసారమైన 'హరిభక్తుల కథలు' ధారావాహికకు కూడా ఆయనే నిర్మాత. మహేశ్ మంచి రచయిత కూడా. రచయితగా, నిర్మాతగా పలు పురస్కారాలను కూడా ఆయన అందుకున్నారు. ఆయన మృతి పట్ల సినీ, టీవీరంగ ప్రముఖులు ప్రగాఢ సంతాపం వెలిబుచ్చారు.

ఆ క్షణాలు.. నా జీవితంలో అద్భుతాలు

స్థాయిని బట్టి కోరికలు ఉంటాయి. కలిగిన వాళ్ల కోరికలు ఒకలా ఉంటే.. లేనివాళ్ల కోరికలు ఒకలా ఉంటాయి. కానీ నటి శోభిత ధూళిపాళ కోరిక మాత్రం చిత్రవిచిత్రమైనది. పెళ్లికాని ఆడపిల్లకు ఈ తరహా కోరిక ఉండటం నిజంగా ఆశ్చర్యమే. ఇటీవల ఓ విలేకరుల సమావేశంలో తన చిరకాల వాంఛ గురించి ఆసక్తికరంగా మాట్లాడింది శోభిత. 'నా జీవితానికి ఓ లక్ష్యం అంటూ లేదు. అది ఎటు తీసుకెళ్తే అటు వెళ్లడమే నా పని. ఆ మాటకొస్తే ఎవరైనా చివరికి చేసేది అదే. లక్ష్యాలనేవి చెప్పుకోడానికే పనికొస్తాయి. నేను ఎప్పుడూ ప్రశాంతంగా ఉండటానికి కారణం కూడా అదే కావొచ్చు. నా వరకు నేను ఎక్కువగా కోరుకునేది మాతృత్వాన్ని. నేను అమ్మను ఎప్పుడవుతానో కానీ.. ఆ క్షణాలు నా జీవితంతో అద్భుతాలు.. అంతే. 'అమ్మ' అని పిలిపించుకోవడం ఎంత బావుంటుందో..' అంటూ అందరికీ షాక్ ఇచ్చేసింది శోభిత. ఏదేమైనా అమ్మ అనిపించుకోవాలని ఆరాటపడటం మాత్రం నిజంగా గొప్ప విషయమే.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.